# ఆయాసం - అనుభవం



రవి ఒక ప్రఖ్యాత ప్రజానాయకుడు.

ఆయన ఏ ఒక్క రాష్ట్రానికో, వర్గానికో చెందినవాడు కాకుండా, యావత్ దేశానికి యువ నాయకుడై, మకుటం లేని మహారాజులాగా వెలుగొందుతున్నాడు. మకుటం లేకపోయినా, ఆయన అలవాట్లన్నీ మహారాజులవే.., ఆయనకి జరిగే మర్యాదలూ మహారాజులవే! గొప్ప గొప్ప ప్రజానాయకులూ, అధికారులు కూడా ఆయనను ప్రసన్నుని చేసుకోడానికి తాపత్రయపడేవారు. ఆయన అభీష్టాలు తెలుసుకుని వాటిని సమకూర్చడానికి సర్వవిధాలా ప్రయత్నించేవారు.

ఆ మహానగరానికి రవిగారు వస్తున్న సందర్భంగా, నగరాన్ని ఎంతో సుందరంగా అలంకరించారు నగర పాలకులు. బ్రహ్మాండమైన సన్మానసభ ఏర్పాటు చేసి, వేలకొద్ది జనాన్ని లారీల నిండా తోలుకొచ్చారు నగర పాలకులు.

ఆయన సభాస్థలి చేరగానే, సర్వాలంకార శోభితమైన ఏనుగు చేత, ఆయన మెడలో దండవేయించారు. ఆనాటి కార్యక్రమాన్నంతా రంగుల చిత్రంగా నిర్మించారు.

సభ అయిపోయిన తర్వాత, పురప్రముఖులతో ఒక గొప్ప విందును ఏర్పాటు చేశారు. తనకి జరిగిన మహరాజ సత్కారానికి ఎంతగానో సంతోషించాడు రవి.

ఆనాటి కార్యక్రమాలతో అలసిపోయిన రవిగారికి, నగరంలో తగిన విశ్రాంతి లభించపోవచ్చునని, ముప్పది మైళ్ళ దూరంలోనున్న ప్రకృతి సౌందర్యం ఉట్టిపడే, ఒక చిన్న ఊరిలో ఒక నవాబుగారి బంగళాలో రాత్రి బస ఏర్పాటు చేశారు. ఆయన ఒంటిగా నిద్రించడానికి ఇబ్బంది పడతారేమోనని, ఆయనకి జంటగా ఒక అందమైన ప్రఖ్యాత నర్తకీమణిని నియమించారు.

రవిగారు విడిది చేరంగానే, ఆమె సర్వాలంకారాల్తో హారతి పళ్లెంతో స్వాగతం ఇచ్చి, ఆయనను లోనికి తీసుకువెళ్తుంది. ఈ ఏర్పాటు రవిగారికి తెలియజేశారు. ఆయన మందహాసంతో తన సమ్మతిని తెలియజేశాడు.

రవిగారి కారు ఊరి పొలిమేర చేరినట్లు విడిదిలోని వారికి వార్త వచ్చింది.

నర్తకీమణి తత్తరపాటుతో హారతి పళ్లెంతో నిలబడింది. ఐదు నిముషాలు గడిచింది. నర్తకీమణికి తన అలంకారం ఒక్కసారి సరిచేసుకుని రావాలనిపించింది.

చేతిలోని హారతి పళ్లాన్ని పక్కనున్న పనికత్తె చేతికిచ్చి తాను లోనికి వెళ్లింది. మూడు గంటలు మేకప్ చేసుకున్నా అది సరిగా లేదేమోనని, అద్దం ముందు చూసుకోసాగింది.

ఇంతలో... రవిగారి కారు రానేవచ్చింది.

నిద్రకి వేళ అవుతోందనే ఉద్దేశంతో, కారు దిగీదిగగానే, లోనికి వడివడిగా నడుస్తూ వెళ్లాడు. ఎదురుగా హారతి పళ్లెంతో నుంచున్న అమ్మాయిని చూసి చిరునవ్వుతో పలకరించి, ఆమె నడుముని వాటేసుకొని లోనికి తీసుకుపోయాడు.

తత్తపాటుతో బయటకు వచ్చింది నర్తకీమణి. అప్పటికే రవిగారి గది తలుపులు మూసుకున్నాయి.

'ఆయాసం తనదీ, అనుభవం పనికత్తెదీ' అయిందని కూలబడిపోయింది నర్తకీమణి.

– హాస్యప్రభ... ఫిబ్రవరి '78